సాక్షి జగిత్యాల

బుధవారం । 4 । జనవరి । 2023



కుజదోష నివారణ పూజలు

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి యాగశాలలో మంగళవారం అర్చకులు కుజదోష నివారణ పూజలు నిర్వహించారు.



అభివృద్ధి పనుల పరిశీలన

కోరుట్ల: పట్టణంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను అదనపు కలెక్టర్ మకరంద్ మంగళవారం పరిశీలించారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
29.0/19.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరిగి పగటిపూట ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'గల్ఫ్ కార్మికుల సమస్యల ప్రస్తావన లేదు'

జగిత్యాలక్రైం: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఈనెల 8–10వ తేదీ వరకు భారత ప్రభుత్వం చేపట్టే 17వ ప్రవాసీ భారతీయ దివస్ వేడుకల ఎజెండాలో గల్ఫ్ కార్మికుల సమస్యలకు చోటు దక్కలేదని తెలంగాణ గల్ఫ్ కార్మికుల జేఏసీ చైర్మన్ గుగ్గిళ్ల రవిగౌడ్ విమర్శించారు. మంగళవారం ఆయన జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. గల్ఫ్ కార్మికుల గళం వినిపించడానికి ఈనెల 7న హైదరాబాద్‌లో మజ్దూర్ ప్రవాసీ దివస్ నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ప్రభుత్వం ఎన్నారైల పెట్టుబడులపైనే ప్రేమ చూపుతూ ప్రవాసీల సంక్షేమాన్ని విస్మరిస్తోందని ఆయన విమర్శించారు. మానవ వనరులను ఎగుమతి చేస్తూ విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జిస్తోందని దుయ్యబట్టారు. సుమారు 88 లక్షల మంది భారతీయులు గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్నారని, వారికోసం ఒక ప్లీనరీ నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయురాలికి 'పూలే' పురస్కారం



పురస్కారం అందుకుంటున్న కటకం కవిత

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): స్థానిక జెడ్పీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయురాలు కటకం కవిత సావిత్రీబాయి పూలే పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన వారికి రాష్ట్రస్థాయిలో సావిత్రీబాయి పూలే పురస్కారాలు అందించారు. సాహిత్య రంగంలో విశేష ప్రతిభ కనబరుస్తున్న కవితకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో పురస్కారం, ప్రశంసాపత్రం అందజేశారు. ఆమెను పలువురు అభినందించారు.


'పాలకుల తీరు ఎండగడతాం'



మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్

మేడిపెల్లి(వేములవాడ): కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి సాధ్యమని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అన్నారు. స్థానిక పీఎస్‌ఆర్ గార్డెన్‌లో మంగళవారం మేడిపెల్లి, భీమారం మండలాల కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, 'బూత్ గెలిచి.. సీటు గెలుద్దాం' నినాదంతో ప్రజల్లోకి వెళ్లాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్దామని కోరారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల 26 లోపు గ్రామ, మండలస్థాయి కమిటీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఏర్పాట్లు పరిశీలన



వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

మెట్‌పల్లి(కోరుట్ల): పట్టణంలో ఈనెల 5న జరిగే మంత్రి హరీశ్‌రావు పర్యటన ఏర్పాట్లను ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు మంగళవారం పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వద్ద భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేస్తారు. అదేస్థలంలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంపీపీ మారు సాయిరెడ్డి, వైద్యులు అమరేశ్వర్, సాజిద్ తదితరులు ఉన్నారు.

వలకు చిక్కిన 10 కిలోల చేప



చేపతో నరేశ్

కథలాపూర్(వేములవాడ): పెగ్గెర్ల గ్రామశివారులోని ఎస్సారెస్పీ వరదకాలువలో మంగళవారం ఓ మత్స్య కారుడి వలకు 10 కేజీల చేప చిక్కడంతో ప్రజలు చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. బొమ్మెన గ్రామానికి చెందిన దేశవేని నరేశ్ వరదకాలువలో చేపల కోసం వల వేశాడు. అనూహ్యంగా 10 కేజీల చేప చిక్కడంతో అవాక్కయ్యాడు. దానిని మార్కెట్‌లో రూ.1,000కి విక్రయించినట్లు నరేశ్ తెలిపాడు.

ఎవరి వాటా ఎంత?

కోరుట్ల మెప్మా విభాగం నుంచి మంజూరు చేయించిన రుణాల దుర్వినియోగం కొత్త మలుపు తిరిగింది. ఎనిమిది మహిళా సంఘాలకు చెందిన సుమారు రూ.80లక్షలు దుర్వినియోగమయ్యాయనే కారణంతో ఇప్పటికే ఆర్పీని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. మరింత సమాచారం తెలుసుకునేందుకు మెప్మా ఇన్‌చార్జి(కో ఆర్డినేటర్)ని ప్రశ్నించారు. అవకతవకలతో తనకు ఎలాంటి సంబంధం లేకున్నా ఇందులో ఇరుకున్నాననే మనస్తాపంతో ఆయన ఆత్మహత్యకు యత్నించడం, స్థానికేతరులకూ నిబంధనలు అతిక్రమించి రుణాలు మంజూరు చేశారని వెలుగులోకి రావడం ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారాయి.



కోరుట్ల మున్సిపల్ కార్యాలయం

- రుణాల దుర్వినియోగంపై లోతుగా విచారణ
- సీరియస్‌గా పరిగణించిన పోలీసులు
- మెప్మా ఇన్‌చార్జి(కో ఆర్డినేటర్)ని విచారించిన వైనం
- మనస్తాపంతో ఆత్మహత్యకు యత్నం
- కాపాడిన రైతులు, గ్రామస్తులు
- జగిత్యాల ఆస్పత్రికి తరలింపు
- కోరుట్ల మున్సిపాల్టీలో కలకలం

గల్లంతు సొమ్ము లెక్క తేలేది ఎలా?

- మెప్మా నేతృత్వంలో మంజూరైన రుణాల గల్లంతు లెక్క తేల్చడం ఎలా అనే విషయంలో పోలీసులు లోతుగా విచారణ చేస్తున్నారు. మెప్మా ఇన్‌చార్జి, ఆర్పీ స్వర్ణలత కలిసి సుమారు 10–15 కొత్త మహిళా సంఘాలను తయారుచేసి వారికి రూ.10–రూ.12 లక్షల వరకు రుణాలు మంజూరు చేయించినట్లు పోలీసులు భావిస్తున్నట్లు సమాచారం. కొత్తగా సృష్టించిన సంఘాలకు చెందిన సభ్యులను విచారణ చేస్తే కానీ.. మెప్మా ఇన్‌చార్జి, ఆర్పీలు ఎంత సొమ్ము దుర్వినియోగం చేశారనే విషయం తేలుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మెప్మా ఇన్‌చార్జి జలేందర్ నెల క్రితం తాను వినియోగించిన డబ్బుల్లో కొంత బ్యాంకులో మళ్లీ జమచేసినట్లు సమాచారం. పోలీసుల విచారణ పూర్తయితే గానీ నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు లేవు.

కోరుట్ల: మహిళా సంఘాల రుణాల మంజూరులో చోటుచేసుకున్న నిధుల దుర్వినియోగంలో ఎవరిపాత్ర ఎంత? అనే విషయంలో పోలీసులు లోతుగా విచారణ చేస్తున్నారు. ఈక్రమంలో మంగళవారం ఉదయం మెప్మా ఇన్‌చార్జి(కో ఆర్డినేటర్) ఆత్మహత్యకు యత్నించడం కలకలం రేపింది. కోరుట్ల మున్సిపల్ విభాగంలోని మెప్మా ఇన్‌చార్జి జలేందర్ మంగళవారం జగిత్యాల మండలం తాటిపల్లి శివారులోని ఓ వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగి, బావిలో దూకి ఆత్మహత్యకు యత్నించారు. స్థానికులు గమనించి వెంటనే జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. ఆత్మహత్యా యత్నానికి ముందు రుణాల గల్లంతులో తాను అవకతవకలకు పాల్పడలేదని సెల్ఫీ వీడియో తీశారని, తన భార్య విజయను జాగ్రత్తగా చూసుకోవాలని బంధువులకు సమాచారం చేరవేయడం గమనార్హం. ఇదిలా ఉండగా.. తాను రుణాల మంజూరులో అవకతవకలకు పాల్పడలేదని, మెప్మా ఇన్‌చార్జి జలేందర్‌దే పూర్తిబాధ్యత అని ఆర్పీ స్పష్టం చేశారు. ఇలా పరస్పరం ఆరోపణలు చేసుకోవడంలో ఆంతర్యం ఎవరికీ అంతుచిక్కడం లేదు.

అడ్డగోలుగా రుణాలు..

- మహిళా సంఘాలకు రుణాలు మంజూరు చేయడంలో స్థానిక బ్యాంకులకే పూర్తి అవకాశం, అధికారం ఉంటుంది.
- కానీ కోరుట్ల, మేడిపల్లి, జగిత్యాల పరిసర ప్రాంతాలకు చెందిన మహిళల పేర్లతో సృష్టించిన మహిళా సంఘాలకు మెట్‌పల్లిలోని ఓ ప్రైవేట్ బ్యాంకు అడ్డగోలు రుణాలు మంజూరు చేయడంలో మతలబు అంతుచిక్కడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.
- మహిళా సంఘాలకు రుణాలు మంజూరు చేసే సమయంలో.. సంఘాల సభ్యులు ఇప్పటికే రుణాలు తీసుకున్నారా? చెల్లింపులు పూర్తిచేశారా? పొదుపు ఖాతాలు ఉన్నాయా? స్థానికులా?కాదా? అనే సమగ్ర వివరాలను బ్యాంకర్లు క్షేత్రస్థాయిలో ఫీల్డ్ ఆఫీసర్‌తో విచారణ చేయించాల్సి ఉంటుంది.
- ఈ ప్రక్రియ ఏదీ లేకుండానే కేవలం మెప్మా ఇన్‌చార్జి, ఆర్పీలు అందించిన ధ్రువీకరణపత్రాలతో స్థానికేతరులైన మహిళలకు మెట్‌పల్లి బ్యాంకులో రుణాలు ఎలా మంజూరు చేశారనే అంశం ప్రస్తుతం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.
- రుణాల మంజూరులో మెప్మా సిబ్బంది, బ్యాంకు సిబ్బంది పాత్ర ఉందా? అనే కోణంలో పోలీసులు విచారణ వేగవంతం చేశారు.

సమస్యలపై గళం విప్పిన సభ్యులు



జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతను సీట్లో కూర్చోబెడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

- ప్లకార్డులో నిరసన తెలిపిన మెట్‌పల్లి జెడ్పీటీసీ
- వాడీవేడిగా జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశం

జగిత్యాలజోన్: ప్రజా సమస్యలపై జిల్లా పరిషత్ సభ్యులు గళం విప్పారు. జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అధ్యక్షతన మంగళవారం జెడ్పీ సర్వసభ్య సమావేశం జరిగింది. మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, కలెక్టర్ రవి హాజరయ్యారు. తొలుత మెట్‌పల్లి జెడ్పీటీసీ కాటిపెల్లి రాధ మాట్లాడుతూ, జెడ్పీ స్పెషల్ గ్రాంట్ నిధులు తమ మండలానికి ఎందుకు కేటాయించడం లేదన్నారు. ప్లకార్డుతో నిరసన తెలిపారు. మెట్‌పల్లి ఎంపీపీ సాయిరెడ్డి మాట్లాడుతూ, నిధుల వివరాల కోసం ఎంపీడీవో రికార్డుల్లో సరిచూసుకోవాలన్నారు. సీఈవో రామానుజాచారి మాట్లాడుతూ, అన్నింటితో సమానంగా మెట్‌పల్లికీ నిధులు కేటాయించామన్నారు. సరైన సమాధానం రాలేదని భావించిన రాధ.. సభ నుంచి బయటకు వెళ్లిపోయారు.

రోళ్లవాగుపై చర్చ..

- రోళ్లవాగు ఆయకట్టుకు ఈయాసంగిలో సాగు నీటిపై రైతులు ఆందోళన చెందుతున్నారని బీర్‌పూర్ ఎంపీపీ రమేశ్ అన్నారు.
- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ, గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే 0.25 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యమున్న ప్రాజెక్టును ఒక టీఎంసీకి పెంచుతున్న క్రమంలో కట్ట వర్షాలకు కొట్టుకుపోయిందన్నారు.
- మంత్రి ఈశ్వర్ మాట్లాడుతూ, దాదాపు రూ.208 కోట్లు వెచ్చించి రోళ్లవాగును ఆధునికీకరిస్తున్నామన్నారు. 15 రోజుల్లోగా ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు.
- బాలింతల మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయని, దీనిపై ఎవరు సమాధానం చెబుతారని జగిత్యాల ఎంపీపీ రాజు ప్రశ్నించారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ, ఆస్పత్రి సూపరింటెండెంట్ పొంతనలేని సమాధానాలు చెబుతున్నారని, మరోసారి ఇలా చేస్తే ఆరోగ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. కలెక్టర్ రవి స్పందిస్తూ, బాలింతల మరణాల్లో ఎవరి నిర్లక్ష్యం ఉన్నా చర్యలు తీసుకుంటామన్నారు. ఆపరేషన్ విభాగంలో మౌళిక వసతుల కొరత ఉందని తమ దృష్టికి వచ్చిందని గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు. జిల్లా ఆస్పత్రి అస్తవ్యస్తంగా ఉందని డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి ఆరోపించారు. కొడిమ్యాలలో సాధారణ ప్రసవాలు జరగడంలేదని, దీంతో గర్భిణులు జగిత్యాలకు రావడం ఇబ్బందిగా ఉందని అక్కడి ఎంపీపీ మేన్నేని స్వర్ణలత అన్నారు.
- కోరుట్ల మండలం అయిలాపూర్ పాఠశాలలో మన ఊరు–మన బడి పనులు పూర్తి కావడం లేదని ఎంపీపీ శ్రీనివాస్ అన్నారు. పనులు ప్రగతిలో ఉన్నాయని కలెక్టర్ సమాధానమిచ్చారు.
- మల్లాపూర్ మండలంలో మన ఊరు–మన బడి పనుల నిర్వహణ బాధ్యతను పంచాయతీరాజ్ శాఖకు మార్చాలని జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. పనులు పూర్తిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.
- రజకులు, నాయీబ్రాహ్మణులకు 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యం ఉన్నా.. నోటీసులు ఎందుకు జారీచేస్తున్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ప్రశ్నించారు. 250 యూనిట్ల కన్నా ఎక్కువ వినియోగించిన వారికే నోటీసులు ఇస్తున్నామని అధికారులు వివరణ ఇచ్చారు.
- సీసీ రోడ్లు నిర్మించిన సర్పంచులకు బిల్లులు విడుదల చేయాలని బుగ్గారం జెడ్పీటీసీ బాదినేని రాజేందర్ విన్నవించారు.
- రామన్నపేట–నూకపల్లి వద్ద వరదకాలువపై సూపర్ ప్యాకేజీ ఎత్తుగా ఉండటంతో గ్రామాల్లోకి నీరు వస్తోందని మల్యాల జెడ్పీటీసీ రామ్మోహన్‌రావు అన్నారు.
- ఈజీఎస్ ద్వారా రైతులు నిర్మించుకున్న కల్లాలపై కేంద్రప్రభుత్వం వైఖరికి నిరసనగా సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది.
- వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆకాంక్షించారు.
- వ్యవస్థ కోసం పనిచేద్దామని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు.
- అంతకుముందు మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు సంజయ్‌కుమార్, విద్యాసాగర్‌రావు జెడ్పీ కార్యాలయం ప్రారంభించారు.

పొగమంచు కురిసింది..



కోరుట్ల పట్టణ, శివారు ప్రాంతాల్లో మంగళవారం పొగమంచు కమ్ముకుంది. ఉదయం 7 గంటల వరకూ రహదారులు, నివాసాలు, రైల్వేస్టేషన్‌ను కమ్మేసింది. వాహనదారులు, ఉదయం వాకింగ్ చేసేవారూ తోవ కనిపించక ఇబ్బంది పడ్డారు. మరోవైపు.. చల్లని వాతావరణం ఆహ్లాదం పంచింది. - కోరుట్లటౌన్



మహిమగల దేవుడు కొండగట్టు అంజన్న



మొక్కులు చెల్లిస్తున్న స్పీకర్ శ్రీనివాస్‌రెడ్డి



స్పీకర్ శ్రీనివాస్‌రెడ్డితో సుదర్శన్



క్యూలైన్‌లో చిన్నారులతో తల్లులు అవస్థలు

- అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయస్వామి మహిమగల దేవుడని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన కుటుంబ సమేతంగా శ్రీఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాకతీయుల కాలంనాటి ఈ ఆలయానికి గొప్పచరిత్ర ఉందని తెలిపారు. పుణ్యక్షేత్రం అభివృద్ధికి సీఎం కేసీఆర్ రూ.100 కోట్లు కేటాయించారని గుర్తు చేశారు. రాష్ట్రంలోనే కాకుండా జాతీయ స్థాయిలోనూ సుపరిపాలన అందించేందుకు సీఎం కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని తెలిపారు. శ్రీఆంజనేయస్వామి దయతో ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఆయన వెంట ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, సంజయ్‌కుమార్, కలెక్టర్ రవి, ఆర్డీవో మాధురి, సీఐ రమణమూర్తి, ఆలయ ట్రస్టీ చైర్మన్ మారుతీస్వామి ఉన్నారు.

భక్తులకు తప్పని ఇబ్బందులు

ప్రముఖుల పూజల సందర్భంగా భక్తుల దర్శనాలను సుమారు రెండు గంటల పాటు నిలిపివేశారు. దీంతో క్యూలైన్లలో గంటల కొద్దీ నిల్చున్న భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. పిల్లాపాపలతో వచ్చిన వారికి చుక్కలు కనిపించాయి. అయితే, వీఐపీల దర్శనానికి తాము వ్యతిరేకం కాదని, కానీ, రద్దీ సమయాల్లో వస్తే ముందస్తు సమాచారం ఇవ్వాలని, ఇలా చేస్తే తాము ప్రత్యామ్నాయం చూసుకుంటామని పలువురు భక్తులు అన్నారు.

సుదర్శన్‌తో 30ఏళ్ల స్నేహబంధం

మల్యాల(చొప్పదండి): మల్యాల సర్పంచ్‌గా మూడు దశాబ్దాలుగా సేవలందిస్తున్న మిట్టపల్లి సుదర్శన్‌తో తనకు 30 ఏళ్ల స్నేహబంధం ఉందని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్న శ్రీనివాస్‌రెడ్డిని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్ కలిసి అభివృద్ధికి సహకరించాలని కోరారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, ఎమ్మెల్యే రవిశంకర్, మిట్టపల్లి సుదర్శన్‌ను స్పీకర్‌కు పరిచయం చేయగా, సుదర్శన్‌తో తనకు ముప్పై ఏళ్లుగా స్నేహబంధం ఉందని స్పీకర్ చెప్పడంతో అందరూ ఆశ్చర్యానికి గురయ్యారు.

బీమా పరిహారం రెట్టింపు

- ఉపాధిహామీ కూలీలకు మరింత లబ్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న శ్రామికులు
- జిల్లాలో జాబ్‌కార్డులు 1,54,865
- కూలీల సంఖ్య 2,86,536

పెగడపల్లి(ధర్మపురి): జాతీయ ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు మరింత భరోసా కలిగించేలా ప్రభుత్వం ఇటీవల ప్రమాద బీమా పరిహారం రెట్టింపు చేసింది. కూలీలు పనిచేస్తున్న స్థలాల్లో ప్రమాదవశాత్తు మరణిస్తే.. ఆ కుటుంబానికి అందించే పరిహారం పెంచుతూ పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖలు ఇటీవల ఉత్తర్వులు జారీచేశాయి. సర్కార్ తీసుకున్న ఈ నిర్ణయంతో ఉపాధిహామీ కూలీలతోపాటు వారి కుటుంబసభ్యులకు మరింత ప్రయోజనం చేకూరుతుంది. సాధారణంగా మట్టి పెళ్లలు విరిగి పడటం, పనిముట్లు తగలడం వంటి సంఘటనలతో కూలీలకు గాయాలు అవుతుంటాయి. కొన్ని సందర్భాల్లో మృత్యువాత కూడా పడుతుంటారు. ఇవే కాకుండా కూలీలకు వడదెబ్బ, పాముకాటు, గుండెపోటు తదితర ప్రమాదాలూ పొంచిఉంటాయి. వీటితో చనిపోయినా పరిహారం అందుతుంది.


ప్రమాద బీమా సాయం ఇలా..

- జిల్లాలో 380 గ్రామ పంచాయతీలు ఉన్నాయి.
- మొత్తం 1,54,865 జాబ్ కార్డులు ఉండగా 2,86,536 మంది వరకు కూలీలు తమ పేర్లు నమోదు చేసుకున్నారు.
- ఏడాదికి ఒక కూలీ వంద రోజుల పనిదినాలుగా లక్ష్యం పెట్టుకున్నారు.
- కందకాలు తవ్వడం, చెరువుల్లో పూడికతీత, కాల్వల మరమ్మతు, ఇంకుడు గుంతల నిర్మాణం, వననర్సరీలో గడ్డి తొలగింపు, కాంటూరు కందకాల తవ్వకం, నర్సరీల్లో మొక్కల పెంపకం, హరితహారంలో మొక్కల సంరక్షణ, వాటికి నీళ్లు పట్టడం, శ్మశానవాటికలు, కంపోస్టు షెడ్ల నిర్మాణం, పంట కాల్వల్లో పూడిక తీత, మట్టిరోడ్ల నిర్మాణం, భూ అభివృద్ధి తదితర పనులను ఈజీఎస్ కూలీలు చేస్తుంటారు.
- ఈ పనులు చేస్తున్న కొన్ని సమయాల్లో కూలీలు గాయాల పాలవు తుంటారు.
- ఇలాంటి సమయాల్లో కూలీలకు బీమా పరిహారంగా గతంలో రూ.25 వేలు చెల్లించేవారు.
- ప్రస్తుతం ఆ మొత్తాన్ని రూ.50 వేలకు పెంచారు. అలాగే చికిత్సకు అయ్యే ఖర్చును బట్టి రూ.లక్ష వరకూ చెల్లించే అవకాశం కూడాఉంది.
- ఒకవేళ అంగవైకల్యం కలిగితే గతంలో రూ.50 వేలు చెల్లించేవారు. ఇప్పుడు ఆ మొత్తాన్ని రూ.లక్షకు పెంచారు.
- ప్రమాదంలో ఛాతినొప్పి, గుండెనొప్పి, వడదెబ్బతో మృతి చెందితే ఇంతకు ముందు రూ.50 వేలు చెల్లించేవారు. ప్రస్తుతం దానిని రూ.2 లక్షలకు పెంచారు.
- ప్రమాద బీమాపరిహారం పెంపుతో ఉపాధిహామీ కూలీలకు ఎంతో ప్రయోజనం చేకూరుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



వన నర్సరీలో ఇసుక జల్లెడ పడుతున్న కూలీలు

కూలీలకు ప్రయోజనం



ఉపాధిహామి కూలీలకు పనిప్రదేశంలో ఏదైనా ప్రమాదం జరిగితే వారికి చెల్లించే పరిహారం రెట్టింపు చేశారు. దీనిద్వారా కూలీలకు ప్రయోజనం చేకూరుతుంది. ప్రధానంగా పనిచేస్తున్న చోట ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా ముందస్తు జాగ్రత చర్యలు తీసుకుంటాం. వేసవిలో అయితే కూలీలు ఎక్కువగా హాజరవుతారు. ప్రభుత్వం బీమా రెట్టింపు చేయడం మంచిదే.

– లక్ష్మీనారాయణ, ఇన్‌చార్జీ డీఆర్డీవో

సంతోషంగా ఉంది



ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలు ప్రమాదం బారిన పడితే ప్రభుత్వం అందించే పరిహారాన్ని పెంచడం హర్షణీయం. అనూహ్య సంఘటన జరిగి ప్రమాదానికి గురైతే ప్రభుత్వం అందించే పరిహారం ఎంతోకొంత మాకు ప్రయోజనం చేకూర్చుతుంది. ఈ పరిహారం పెంచడం సంతోషంగా ఉంది.

– బందారి జ్యోతి, ఈజీఎస్ కూలీ, పెగడపల్లి

క్లుప్తంగా

కంటి వెలుగును విజయవంతం చేయండి

జగిత్యాల: కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి కొప్పుల ఈశ్వర్ కోరారు. మంగళవారం నూతన సమీకృత కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, అందరికీ కంటి వైద్యం అందేలా చూడాలని అన్నారు. అర్హులైన వారికి శస్త్రచికిత్సలు చేసి కంటి అద్దాలను అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రవి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత, అదనపు కలెక్టర్లు లత, మకరంద్, వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు, మున్సిపల్ కమిషనర్ బోనగిరి నరేశ్ పాల్గొన్నారు.

సీడీపీవో పరీక్ష ప్రశాంతం

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండలం నాచుపెల్లి జేఎన్టీయూలో మంగళవారం చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్(సీడీపీవో) పరీక్ష ప్రశాంతంగా జరిగింది. కంప్యూటర్ బేస్‌డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్, ఆన్‌లైన్ పద్ధతిన పరీక్ష నిర్వహించారు.

రుణాల కుంభకోణంపై దర్యాప్తు జరపాలి

కోరుట్ల: మున్సిపల్‌లోని మెప్మా విభాగంలో మహిళా సంఘాలకు ఇప్పించే రుణాల్లో జరిగిన కుంభకోణంపై సమగ్ర దర్యాప్తు చేయాలని బీజేపీ కౌన్సిలర్ మాడవేని నరేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. మహిళా సంఘాల రుణాల్లో సుమారు రూ.2 కోట్లకుపైగా కుంభకోణం జరిగినట్లు ప్రచారం సాగుతోందన్నారు. దీనిపై కిందిస్థాయి ఉద్యోగులను బలి చేయకుండా సమగ్రంగా దర్యాప్తు జరిపి ప్రమేయమున్న వారందరిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

కెనాల్‌లో గల్లంతైన విద్యార్థి మృతి

జగిత్యాలక్రైం: జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ శివారులోని ఎస్సారెస్పీ కెనాల్‌లో గల్లంతైన కండ్లపల్లి ఆయుష్(15) మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని తీన్‌ఖని ప్రాంతానికి చెందిన ఆయుష్ జగిత్యాలలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఆదివారం సాయంత్రం స్నేహితులతో కలిసి ధరూర్ శివారులోని కెనాల్ వద్ద ఫొటోషూట్‌కు వెళ్లాడు. ఈ క్రమంలో కాలు జారి కాలువలో పడగా గల్లంతయ్యాడు. పెగడపల్లి మండలంలోని దోమలకుంట వద్ద మంగళవారం అతని మృతదేహం లభ్యమైంది. పోలీసులు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

బావిలో పడి ఇద్దరికి తీవ్ర గాయాలు



బాధితుడిని బయటకు తీసుకువస్తున్న దృశ్యం

తిమ్మాపూర్(మానకొండూర్): పూడిక తీసేందుకు బావిలో దిగుతుండగా క్రేన్ వైరు తెగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఎల్ఎండీ ఎస్సై ప్రమోద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని మన్నెంపల్లి గ్రామానికి చెందిన ఖమ్మం మల్లయ్య బావిలో కొందరు కూలీలు పూడిక తీస్తున్నారు. మంగళవారం ఉదయం బావిలోకి దిగుతుండగా క్రేన్ వైరు తెగి, గ్రామానికే చెందిన బీనపెల్లి రాజు, దామ అంజయ్య బావిలో పడ్డారు. ఈ ఘటనలో వారికి తీవ్ర గాయాలయ్యాయి. అప్రమత్తమైన స్థానికులు వెంటనే 108 వాహనంలో కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా, సంఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఈ చదువులు మాకొద్దు!

- మగ్గిడి నుంచి కోరుట్లకు విద్యార్థులు
- సంఖ్య తక్కువ ఉందని అధికారుల నిర్ణయం
- తరలింపుపై చిన్నారుల్లో అసహనం
- ఆందోళనకు దిగిన తల్లిదండ్రులు
- టీసీలు ఇవ్వాలని ప్రిన్సిపాల్‌కు వినతి
- బుజ్జగించి పంపించిన ప్రిన్సిపాల్

ధర్మపురి: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు రాష్ట్రప్రభుత్వం గురుకుల పాఠశాలలు ప్రారంభిస్తోంది. కానీ, సంఖ్య తక్కువగా ఉందనే కారణంతో ఒక బడి నుంచి మరో బడికి వారిని అధికారులు మార్చడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మగ్గిడి గురుకులంలో ఇంటర్ చదివే విద్యార్థులకు ఈ పరిస్థితి ఎదురైంది. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఈ చదువులు మాకొద్దు' అని విద్యార్థులు మొరపెట్టుకుంటున్నారు. మగ్గిడిలోని గురుకుల పాఠశాల ఇందుకు వేదిక అయ్యింది.

తొలుత గొల్లపల్లిలో..

- జిల్లాలోని గొల్లపల్లి మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర గురుకుల పాఠశాలను కొన్నేళ్లక్రితం ప్రారంభించారు.
- అక్కడ వసతులు లేక పోవడంతో ఏడాది నుంచి ధర్మపురి మండలంలోని మారుమూల మగ్గిడి గ్రామానికి విద్యార్థులను తరలించారు.



మగ్గిడి గురుకుల పాఠశాల

- ఆ గ్రామంలోని గురుకుల పాఠశాలలో ఐదు నుంచి ఇంటర్మీడియెట్ వరకు నాణ్యమైన చదువు చెబుతున్నారు.
- వివిధ జిల్లాలకు చెందిన సుమారు 472 మంది విద్యార్థులు ఇందులో విద్య అభ్యసిస్తున్నారు.
- 460 మంది ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుకుంటున్న విద్యార్థులు ఉన్నారు.
- కొత్తగా ప్రారంభించిన ఇంటర్మీడియట్ కోర్సులో కేవలం 12 మంది మాత్రమే విద్యార్థులు ఉన్నారు.
- ఇంటర్ విద్యార్థులతో కలిపితే గురుకులంలో మొత్తం విద్యార్థుల సంఖ్య 472కి చేరింది.

రెండు రోజులకే ఇంటికి..

- మగ్గిడి గురుకులం నుంచి కోరుట్లకు వెళ్లిన 12 మంది విద్యార్థులు.. అక్కడ సరైన వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇక అక్కడ ఉండలేక అదేనెల 22న స్వస్థలాలకు చేరుకున్నారు. అప్పట్నుంచి వారు ఇళ్లలోనే ఉంటున్నారు. సుమారు పన్నెండు రోజులుగా చదువులకు దూరమవుతున్నారు. తాము మగ్గిడి గురుకులంలోనే చదుకుంటామని వారు భీష్మించుకు కూర్చున్నారు.

విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని..

- మగ్గిడి గురుకులంలో ఇంటర్ మొదటి సంవత్సరం సీఈసీలో కేవలం 12 మంది మాత్రమే విద్యార్థులు మాత్రమే చదువుకుంటున్నారు. వీరికోసం ఆరుగురు లెక్చరర్లు విద్యాబోధన చేస్తున్నారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని భావించిన అధికారులు.. లెక్చరర్ల కొరత ఉందనే కారణంతో మగ్గిడిలో చదువుకుంటున్న రామగుండం, కాటారం, మంథని, వరంగల్, జగిత్యాల, కోరుట్ల ప్రాంతాలకు చెందిన 12 మంది విద్యార్థులను గత డిసెంబర్ 20న కోరుట్లలోని గురుకుల పాఠశాలకు తరలించారు. ఇక్కడే అసలు సమస్య మొదలైంది.

నచ్చజెప్పిన ప్రిన్సిపాల్..

- విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడం, లెక్చరర్ల కొరత ఉండడంతో తాత్కాలికంగా విద్యార్థులను కోరుట్ల గురుకులం తరలించామని ప్రిన్సిపాల్ రాజమణి తల్లిదండ్రులకు నచ్చజెప్పారు. కేవలం రెండు నెలల వ్యవధి కోసమే వారిని అక్కడకు పంపించామని, ఆ తర్వాత యథాస్థానంలోకి తరలిస్తామని అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇలా చేయాల్సి వచ్చిందని వివరించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రానివ్వబోమని హామీ ఇవ్వడంతో తల్లిదండ్రులు పునరాలోచనలో పడ్డారు.

టీసీల కోసం మగ్గిడికి చేరిన తల్లిదండ్రులు..

- కోరుట్ల గురుకులంలో అసౌకర్యాల మధ్య చదువులు నచ్చక పోవడంతో విద్యార్థులు ఇంటిదారి పట్టగా.. వారిని ఇతర స్కూళ్లలో చేర్పుతామని, తమకు టీసీలు జారీచేయాలని తల్లిదండ్రులు కోరారు. ఈమేరకు మంగళవారం ఆయా ప్రాంతాలకు చెందిన తల్లిదండ్రులు మగ్గిడి గురుకులానికి చేరుకున్నారు. తక్షణమే టీసీలు జారీ చేయాలని ప్రిన్సిపాల్ రాజమణికి విన్నవించారు.

'సావిత్రీబాయి' సేవలు చిరస్మరణీయం

- రాష్ట్రమంత్రి కొప్పుల ఈశ్వర్
- ఘనంగా 'పూలే' జయంతి

జగిత్యాల: ఆడపిల్లల చదువు కోసం నిరంతరం పాటుపడిన పోరాటయోధురాలు సావిత్రీబాయి పూలే అని రాష్ట్రమంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా స్థానిక జెడ్పీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడారు. మహిళా చైతన్యమూర్తి, సామాజిక ఉద్యమకారిణి సావిత్రీబాయి పూలే అని కొనియాడారు. ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని, ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రవి, ఎమ్మెల్యేలు సంజయ్‌కుమార్, విద్యాసాగర్‌రావు, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత, అదనపు కలెక్టర్లు లత, మకరంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శంగా తీసుకోవాలి

వెల్గటూర్(ధర్మపురి): ఉపాధ్యాయులు సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రవి కోరారు. గొడిశెలపేట, ఎండపల్లి పాఠశాలల్లో ఎస్టీయూ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం శనిగరపు రవి మాట్లాడారు. మహిళా సాధికారతకు విశేషంగా కృషి చేసిన సావిత్రీబాయి పూలే అనేక అవమానాలకు గురయ్యారన్నారు. మహిళా విద్యకు పెద్దపీట వేశారని అన్నారు. ముఖ్యంగా అట్టడుగు వర్గాల స్త్రీలు చదువుకునేందుకు పాఠశాలలు ప్రారంభించారని గుర్తు చేశారు. కానీ, ప్రస్తుతం పాఠశాలల్లో సమస్యలు ఉపాధ్యాయులు, విద్యార్థులను ముప్పుతిప్పలు పెడుతున్నాయని విమర్శించారు. గొడిశెలపేట ఉపాధ్యాయులు తిరుమల, సుజాత, లలిత, ఎండపల్లిలోని జ్యోతి, త్రికరణ, శ్రావణి, విద్యావలంటీరు పుష్పలతను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి గాలేటి తిరుపతిరెడ్డి, ప్రతినిధులు నాగం రమేశ్, శ్రీనివాస్, కుమారస్వామి, శ్రీనివాస్‌రెడ్డి, రాజేశం, గంగయ్య, కుమార్, గణేశ్, శర్మ, రాజేశ్వరరావు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న మంత్రి కొప్పుల, ఎమ్మెల్యేలు

పూలేను ఆదర్శంగా తీసుకోవాలి

జగిత్యాలరూరల్: మనదేశ మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బ్రహ్మండబేరి నరేశ్ కోరారు. సావిత్రీబాయి పూలే జయంతిని సందర్భంగా స్థానిక ప్రభుత్వ బాలికల బీసీ వసతి గృహంలో మంగళవారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. నాయకులు గాజుల నాగరాజు, సతీశ్, నాగరాజు, భూమి రమణ, చందన్‌కుమార్, జలజ, విజయ్, పావని పాల్గొన్నారు.

విద్యుత్ శాఖలో..

జగిత్యాలజోన్: జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఎస్ఈ సత్యనారాయణ సావిత్రీబాయి పూలే జీవిత విశేషాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు తిరుపతయ్య, శివరాం, రాజిరెడ్డి, తిరుపతి, నగేశ్‌కుమార్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

- సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి
- ఎస్పీ సింధూశర్మ

మల్లాపూర్(కోరుట్ల): పోలీసులు అంకితభావం, జవాబుదారీతనంతో విధులు నిర్వర్తించాలని ఎస్పీ సింధూశర్మ సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్సై, పోలీస్ సిబ్బంది పనితీరు పర్యవేక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో గస్తీ, పెట్రోలింగ్, విజువల్ పోలీసింగ్ పెంచాలని చెప్పారు. పాతనేరస్తులు, అనుమానితులు, రౌడీషీటర్లపై నిఘా పెంచాలని చెప్పారు. సైబర్ నేరాల నియంత్రణకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, మహిళా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. నేరం జరిగినపుడు సరైన సమాచార సేకరణ, ఆధునికత, సాంకేతికత వినియోగించాలని, తద్వారా దోషులకు కోర్టుల ద్వారా శిక్ష పడేలా చేయాలని, బాధితులకు న్యాయం జరిగేలా వ్యవహరించాలని చెప్పారు. గ్రామాల్లో అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల సమాచారం మల్లాపూర్ ఎస్సై సెల్ నంబర్ 94407 95147కు అందించాలని సూచించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఆమె వెంట మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ లక్ష్మీనారాయణ, మల్లాపూర్ ఎస్సై నవీన్‌కుమార్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



మొక్క నాటి నీళ్లు పోస్తున్న ఎస్పీ సింధూశర్మ

నేరాల నియంత్రణ లక్ష్యం

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): నేరాల నియంత్రణ లక్ష్యంగా పోలీసులు సేవలు అందించాలని ఎస్పీ సింధూశర్మ సూచించారు. స్థానిక పోలీసుస్టేషన్‌ను ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. రిసెప్షన్ కౌంటర్, రికార్డులు పరిశీలించారు. ఫిర్యాదులు, కేసుల నమోదుపై ఆరా తీశారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. చోరీలను నియంత్రించాలని చెప్పారు. రౌడీల కదలికలపై నిఘా ఉంచాలని అన్నారు. సిబ్బంది సమస్యల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ లక్ష్మీనారాయణ, ఎస్ఐ ఉమాసాగర్ పాల్గొన్నారు.

అక్కను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడని..

- స్నేహితుడితో కలిసి యువకుడి అద్దె ఇంటికి నిప్పు పెట్టిన తమ్ముడు
- రూ.2 లక్షల ఆస్తి నష్టం
- ఇద్దరు మైనర్లపై కేసు

హుజూరాబాద్: తన అక్కను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడని ఆగ్రహించిన ఓ బాలుడు క్షణికావేశంలో యువకుడు ఉంటున్న ఇంటిని పెట్రోల్ పోసి, తగులబెట్టాడు. ఈ సంఘటన మంగళవారం హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలోని ఇందిరానగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లి ఇందిరానగర్‌లో వరికిల్ల దేవయ్య ఓ పెంకుటింట్లో అద్దెకు ఉంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయన కుమారుడు రాజశేఖర్ సమీపంలోని యువతిని ప్రేమించి, సోమవారం పెళ్లి చేసుకొని, స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. పోలీసులు వారికి కౌన్సెలింగ్ చేస్తుండగానే ఆ యువతి సోదరుడు తన స్నేహితుడితో కలిసి రాజశేఖర్ ఉంటున్న ఇంటికి పెట్రోల్ పోసి, నిప్పంటించాడు. విషయం తెలిసిన వెంటనే హుజూరాబాద్ పోలీసులు, ఫైర్ సిబ్బంది హుటాహుటిన వెళ్లి, మంటలు ఆర్పివేశారు. కానీ అప్పటికే ఇల్లు, ఇంట్లోని వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. రాజశేఖర్ తన పెళ్లి కోసం వాహనాన్ని విక్రయించి, తెచ్చుకున్న రూ.50 వేలు, కొత్త దుస్తులు, ఇంట్లోని సామగ్రి కాలిబూడిదయ్యాయి. ఈ ఘటనలో రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని దేవయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ బొల్లం రమేశ్, ఎస్సై ఆసిఫ్‌లు తెలిపారు.



మంటల్లో కాలిపోతున్న ఇల్లు

మద్యం దుకాణంలో తనిఖీలు

శంకరపట్నం(మనకొండూర్): కేశవపట్నంలోని ఓ మద్యం దుకాణంలో ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. శంకరపట్నం మండలంలోని అంబాల్‌పూర్‌కు చెందిన సముద్రాల అజయ్ సోమవారం రాత్రి తన స్నేహితులతో కలిసి, కేశవపట్నంలోని మద్యం దుకాణంలో మూడు బీరు బాటిళ్లు కొనుగోళ్లు చేశాడు. పొద్దంతా పని చేసిన అజయ్ కొంతమేర బీరు తాగగానే కడుపులో మంట వచ్చింది. స్థానిక ఆర్ఎంపీని సంప్రదించాడు. తర్వాత అతని స్నేహితులు, సోదరుడు అశోక్ కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతున్నాడు. వారు ఎక్సైజ్ పోలీసులకు ఫోన్ చేసి, విషయం చెప్పడంతో హుజూరాబాద్ ఎక్సైజ్ ఎస్సై రమ్య మద్యం దుకాణంలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. బీరు బాటిళ్లను పరిశీలించారు. అజయ్ తాగిన బాటిల్, మద్యం దుకాణంలోని మరికొన్ని బాటిళ్లను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించనున్నట్లు పేర్కొన్నారు.



బీరు బాటిల్‌ను పరిశీలిస్తున్న ఎస్సై రమ్య

ఆటోడ్రైవర్‌కు ఆరు నెలల జైలు

జగిత్యాలక్రైం: ఆటోను అజాగ్రత్తగా నడిపి, ఓ వ్యక్తి మృతికి కారణమైన ఆటోడ్రైవర్‌కు ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ జగిత్యాల మొదటి అదనపు కోర్టు జడ్జి జితేందర్ తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల రూరల్ మండలంలోని తాటిపల్లి శివారులో 28.06.2017న అదే గ్రామానికి చెందిన మహారాజు రవి బైక్‌పై వెళ్తున్నాడు. ఆ సమయంలో మానకొండూరు మండలంలోని చెంజర్ల గ్రామానికి చెందిన దుద్దెడ రమేశ్ ఆటోను అజాగ్రత్తగా నడుపుతూ బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రవి చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు అప్పట్లో జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. నిందితుడిని కోర్టు కానిస్టేబుల్ గుండ హరిప్రసాద్ మంగళవారం న్యాయస్థానంలో హాజరుపరిచి, సాక్ష్యులను ప్రవేశపెట్టారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జీ ఆటోడ్రైవర్‌కు ఆరు నెలల జైలుశిక్షతోపాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

రంగాపూర్ కౌలు రైతు..

హుజూరాబాద్‌రూరల్: రంగాపూర్ గ్రామానికి చెందిన కౌలు రైతు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంగళవారం చోటుచేసుకుంది. రెడ్డబోయిన కొమురయ్య (40)– కోమల అనే రైతు దంపతులు వరంగల్ అర్బన్ జిల్లా వంగర గ్రామానికి బతుకుదెరువు కోసం హుజూరాబాద్ మండలంలోని రంగాపూర్ గ్రామాన్ని వదిలి వెళ్లారు. అక్కడ పది ఎకరాల వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకొని, వ్యవసాయం చేస్తున్నారు. పంట దిగుబడి సరిగా రాక అప్పులు ఎక్కువయ్యాయి. దీంతో మానసికంగా ఆందోళన చెందిన కొమురయ్య పురుగుల మందు తాగాడు. కోమల స్థానికుల సాయంతో హుజూరా బాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లింది. పరిస్థితి విషమించడంతో జమ్మికుంటలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

తిమ్మాపూర్(మానకొండూర్): మండలంలోని ఎల్ఎండీ కాలనీ సమీప కాకతీయ కాలువలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని, ఫైర్ సిబ్బంది, జాలర్ల సాయంతో బయటకు తీయించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, అతని వయసు 55 నుంచి 60 ఏళ్ల మధ్య ఉంటుందని ఎస్సై ప్రమోద్‌రెడ్డి తెలిపారు. ఐదు అడుగుల ఎత్తు, చామనఛాయ రంగు, తెల్ల వెంట్రుకలు, ఎరుపు కలర్ షర్టుపై నిలువు నలుపు, తెలుపు గీతలు ఉన్నాయని, నలుపు కలర్ ప్యాంటు వేసుకున్నాడని పేర్కొన్నారు. వివరాలు తెలిసినవారు ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్‌లో లేదా 94407 95112 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని కరీంనగర్ జిల్లా ఆసుపత్రి మార్చురీకి తరలించినట్లు చెప్పారు.

అనారోగ్యం భరించలేక బలవన్మరణం

జ్యోతినగర్(రామగుండం): అనారోగ్య కారణాలతో పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్నపూర్ణకాలనీకి చెందిన మెండె ప్రభాకర్ (45) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. అన్నపూర్ణ కాలనీకి చెందిన ప్రభాకర్ పదేళ్లుగా రామగుండం సీఆర్పీగా పని చేస్తున్నాడు. ఇదివరకే అతనికి ఒక కన్ను లేకపోగా, ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. ఈ క్రమంలో మనస్తాపం చెందిన ఆయన మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చక్రపాణి తెలిపారు.

దళితులను మోసం చేసిన సీఎం

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

గొల్లపల్లి(ధర్మపురి): తెలంగాణ ఆవిర్భవించాక తొలి ముఖ్యమంత్రి దళితుడే అని హామీ ఇచ్చిన సీఎం కేసీఆర్ దళితులను మోసం చేశారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి మంగళవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. 2014 నుంచి 2021వరకు ఎస్సీలకు కేటాయించిన రూ.86వేల కోట్లలో రూ.56వేల కోట్లు ఖర్చు చేసి, మిగతా సొమ్మును దారి మళ్లించారని ఆరోపించారు. ఈసొమ్ముతో సుమారు 6 లక్షల డబుల్‌బెడ్రూమ్ ఇళ్లు నిర్మించే అవకాశం ఉన్నా.. ఆ పనిచేయలేదని దుయ్యబట్టారు. జనాభా ప్రాతిపదికన దళితులకు మూడు మంత్రి పదవులు ఇవ్వాల్సి ఉందని, కానీ, ఒక్కటే ఇచ్చారని అన్నారు. భారత రాష్ట్ర సమితి పేరిట అన్నిరాష్ట్రాలకు ఉచిత విద్యుత్ ఇస్తానని దేశ ఇప్పుడు దేశ ప్రజలను మోసం చేయడానికి ముందుకు వస్తున్నారని మండిపడ్డారు. ఎన్టీపీసీ ద్వారా రూ.ఐదుకే లభ్యమయ్యే యూనిట్ కరెంటును కమీషన్లకు కక్కుర్తిపడి రూ.12 వెచ్చించి కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు నిశాంత్‌రెడ్డి, సర్పంచులు రేవెళ్ల సత్యనారాయణగౌడ్, చిర్రా గంగాధర్, పురంశెట్టి పద్మ, వెంకటేశ్, సరసాని రాజ్యలక్ష్మి, తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ రేవెళ్ల లింగన్నగౌడ్, ఉపసర్పంచ్ కొండ వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

తారకేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు



ఊరేగింపులో శ్రీహరి తీర్థస్వామి, భక్తులు

కథలాపూర్(వేములవాడ): చింతకుంటలోని శ్రీ తారకేశ్వరస్వామి ఆలయంలో శ్రీ మద్భగవద్గీత ఉపన్యాసాలు మంగళవారం రాత్రి ప్రారంభమయ్యాయి. సత్యనందాశ్రమాల పీఠాధిపతి శ్రీహరి తీర్థస్వామి భక్తులనుద్దేశించి ప్రసంగించారు. అంతకుముందు శ్రీహరి తీర్థస్వామికి భక్తులు మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఆయా గ్రామాల భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

పల్లెపాటకు జిల్లాప్రజలు పట్టం కట్టాలి



సమావేశమైన కళాకారులు

జగిత్యాలజోన్/జగిత్యాలటౌన్: తెలంగాణ జానపదాలైన పల్లెపాటకు ప్రజలు పట్టం కట్టాలని ఇండస్ట్రీ ఆఫ్ తెలంగాణ ఫోక్ (ఐటీఎఫ్) జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మల్లిక్‌తేజ అన్నారు. జిల్లా కేంద్రంలోని దేవిశ్రీ గార్డెన్స్‌లో యూట్యూబ్, జిల్లా కళాకారుల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలు ఆదరించినంత కాలం కళలు బతుకుతాయని చెప్పారు. ఫిబ్రవరి 5న గూగులమ్మకు యూట్యూబ్ బోనాలు అనే పండుగ కార్యక్రమాన్ని వేములవాడలో అట్టహాసంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా బాధ్యులు రాజ్ నరేంద్ర, మహిపాల్ ఎములాడ, కోశాధికారి నడిగడ్డ రాజు తదితరులు పాల్గొన్నారు.